క్లుప్తంగా

శ్రీవారి దేవస్థానం ఉద్యోగులకు వైద్య పరీక్షలు

ద్వారకాతిరుమల: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి వ్యక్తి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని శ్రీవారి దేవస్థానం డీఈఓ భద్రాజీ అన్నారు. క్షేత్రంలోని హరిణి కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏలూరుకు చెందిన విజయ ఆస్పత్రి వైద్యులు ఆలయ సిబ్బంది 200 మందికి గుండె, నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రితీష్ పి.తేజస్వి వైద్యసేవ లందించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఘనంగా జగ్జీవన్‌రామ్ వర్ధంతి



జగ్జీవన్‌రామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): దేశంలో అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పని చేసిన వ్యక్తి బాబూ జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఏలూరు, ఎస్సీ ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం భారతదేశ మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతిని మేతర అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మేతర అజయ్ బాబు, జుజ్జువరపు ప్రతాప్, లంకపల్లి మాణిక్యాలరావు, కాశీ కృష్ణ, చొటుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏలూరు (టూటౌన్): భారతీయ జనసంఘ్ పార్టీ ప్రస్తుత బీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 124వ జయంతి కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ ఆఫీసులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్కోజు అనిల్ ఆచార్య మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలను కొనియాడారు. కట్నేని కృష్ణ ప్రసాద్, నగరపాటి సత్యనారాయణ, కన్వీనర్లు గాది రాంబాబు, బాడిత నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులా మారిన పంట కాలువ

- అన్ని రకాల వ్యర్థాలు కాలువలోనే
- తాగునీటి వాల్స్‌లోనూ ఇష్టానుసారం చెత్త



ఏలూరు పాత బస్టాండ్ సమీపంలో పంట కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



పాండురంగా థియేటర్ సమీపంలో తాగునీటి వాల్ వద్ద వేసిన చెత్త

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరం మధ్య నుంచి ప్రవహించే కృష్ణా కెనాల్ పంట కాలువ డంపింగ్ యార్డును తలపిస్తుంది. అన్ని రకాల వ్యర్థాలను కాలువలో నేరుగా వేసేయడంతో పంట కాలువ కాస్తా మురుగు కాలువను తలపిస్తుంది. దీంతో దిగువ పంట పొలాలకు సాగు నీరు వెళ్లేందుకు సైతం అవరోధాలు ఏర్పడుతున్నాయి. దీన్ని సరిచేయాల్సిన సంబంధిత అధికారులు నిత్యం ఆ మార్గంలో వెళుతున్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న పాండురంగ థియేటర్ దగ్గర కాలువలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ గ్లాస్‌లు, బీరు, బ్రాందీ సీసాలతో కాలువంతా నిండిపోయింది.

పరదాలు కట్టినా ప్రయోజనం నిల్

పాత పెద్ద వంతెన వద్ద వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్‌లు, చెత్తాచెదారం అంతా కాలువలో వేయకుండా అధికారులు పరదాలు కట్టారు. అయినా వ్యర్థాలను నేరుగా కాలువలో వేయడం ఆగలేదు. దీంతో అధికారులు చేసిన పని ఎందుకు పనిరాకుండా నిష్ప్రయోజనంగా తయారైంది. తక్షణం ఈ కాలువలో చెత్తను తొలగించి మురుగును శుభ్రం చేసి దోమ కాటు నుండి కాపాడాలని నగర ప్రజలు సంబంధిత అధికారులు కోరుతున్నారు.

తాగునీటి పైపులైన్ వాల్‌ను వదలని వ్యర్థాలు

ఏలూరు పంపుల చెరువు నుంచి నగర ప్రజలకు తాగునీటి సరఫరా చేసే ఒక ప్రధాన పైపులైను వాల్ బ్లాక్ ,ఇది కూడా పాండురంగ థియేటర్ ఎదురుగా కాలువ ప్రక్కన ఉంది. ఈ వాల్ నుంచి తాగునీరు లీక్ అవుతుంది. ఈ బ్లాక్ అంతా కుళ్ళు నీరు వ్యర్థాలతో నిండిపోయింది. దీనిలో ఉన్న కుళ్ళు నీరు లీక్ అవుతున్న పంపుల చెరువు నుంచి సరఫరా అయ్యే తాగు నీటిలో కలిసి తాగునీరు అంతా కలుషితమైపోతుంది. దీనిని కూడా అధికారులు గుర్తించి మురుగు చెత్తను క్లీన్ చేసి ఈ బ్లాక్ పై సిమెంట్ బిళ్లలు రక్షణగా వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని వ్యర్థాలు పంట కాలువలోనే..

ఏలూరు నగరం మధ్య గుండా ప్రవహించే కృష్ణా పంట కాలువ వ్యర్థాలకు నిలయంగా మారింది. షాపులు, మార్కెట్ ప్రాంతాలు, ఇళ్లల్లోని వ్యర్థాలు అన్ని రకాల చెత్తలను నేరుగా తీసుకుని వచ్చి పంట కాలువలో పడవేస్తున్నారు. దీంతో పంట కాలువ కాస్తా మురికి కూపంగా తయారైంది. ఒక పక్క అధికారులు పంట కాలువలో వ్యర్థాలను వేయకుండా చేసేందుకు చేస్తున్న అరకొర పనులు ఎందుకూ పనిరాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా నిర్దిష్టమైన పక్కా ప్రణాళికతో పంట కాలువలో వ్యర్థాలు వేయడాన్ని నిరోధించాలని నగర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పంట కాలువను ప్రక్షాళన చేయాలి



ఏలూరు నగరం మధ్య నుండి ప్రవహించే కృష్ణా పంట కాలువలోని వ్యర్థాలను పూర్తిగా ప్రక్షాళన చేయాలి. అధికారులు ఎన్ని ప్రకటనలు చేసినా చెత్తా, చెదారాన్ని కాలువలో వేయకుండా నిరోధించలేకపోతున్నారు. దీనికి పూర్తి స్థాయి పరిష్కారాన్ని కనుగొని పంట కాలువను పూర్తి స్థాయిలో బాగు చేసి దిగువ రైతులకు సాగునీరు అందించాలి.

– బండి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, బీకేఎంయూ, ఏలూరు జిల్లా

పైప్‌లైన్‌ల లీకేజీలను అరికట్టాలి



ప్రస్తుతం నగరంలో వర్షాలు విరివిగా కురుస్తున్నాయి. ఇలాంటి సమయంలో పైపులైన్లు, వాల్స్ లీకేజీలను పూర్తిస్థాయిలో అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా చేయని పక్షంలో లీకేజీల ద్వారా మురుగు నీరు, కలుషిత నీరు తాగునీటి పైపులైన్‌ల ద్వారా ప్రజలకు సరఫరా అయ్యే ప్రమాదం పొంచి ఉంది. దీని వల్ల ప్రజలకు రోగాలు సోకే ప్రమాదం పొంచి ఉంది.

– బద్దా వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి, ఇఫ్టూ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

ఆటోలకు పోలీస్ క్లియరెన్స్ నంబర్ పొందాలి



లక్ష్మణరావు, ట్రాఫిక్ సీఐ

ఏలూరు టౌన్: ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోల యజమానులు, డ్రైవర్లు తమ ఆటోలకు విధిగా పోలీస్ క్లియరెన్స్ నంబర్ తీసుకోవాలని ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. ఆటోలకు సంబంధించి క్లియరెన్స్ నంబర్ కోసం పలు ధ్రువీకరణ పత్రాలు ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో సమర్పించాలని ఆయన కోరారు. ఆటో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ), పర్మిట్ సర్టిఫికెట్ (పీసీ), ఆటో ఫిట్నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ), ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ (డ్రైవర్ అండ్ ఓనర్) వీటిని అందజేయాలన్నారు. ఈ ధ్రువీకరణ పత్రాలన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు ఫోర్స్‌లో ఉండాలని సూచించారు. ఎవరైనా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, నకిలీ పత్రాలు సమర్పిస్తే వాటిపై విచారణ చేసి చట్టం మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు హెచ్చరించారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందించడం, ప్రయాణికుల భద్రత, సక్రమమైన రవాణా వ్యవస్థ, నిర్వహణకు ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించామని ఆయన స్పష్టం చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దెందులూరు: విద్యార్థులు దాతలు అందించిన నోటు పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని జాలిపూడి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కాటం బల్తజర్ అన్నారు. ఆదివారం ఏలూరు రూరల్ మండలం మానూరు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం తేరా ప్రసాద్ ఆధ్వర్యంలో 30 మంది విద్యార్థులకు 200 నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గెస్ట్ ఫర్ దేవ సహాయం, కాటం బాలస్వామి, తేరా దేవ సుందరం, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనపై పోరాటం చేయాలి

కంభం విజయరాజు పిలుపు



సభలో మాట్లాడుతున్న కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాడాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పార్టీ పట్టణ అధ్యక్షుడిగా కర్పూరం గవరయ్య గుప్త (నాని) ప్రమాణస్వీకార సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గవరయ్య గుప్తచే పట్టణ మాజీ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో విజయరాజు మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు సక్రమంగా నెరవేర్చకుండానే ప్రజల్లోకి వెళుతున్నారని. దీంతో వారిని నిలదీసే పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు మేలు చేశారన్నారు. ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ నినాదంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

మరో ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకుడు జెట్టి గురునాథరావు మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ పదవులు అలంకారాలు కాదని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, కౌన్సిలర్‌లు, మండల కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి నాగేంద్ర, ముప్పిడి శ్రీను, చింతా అనిల్‌కుమార్, షేక్ అక్బర్, చనమాల శ్రీనివాస్, వందనపు వెంకటేశ్వరరావు, బత్తిన చిన్న, జెట్టి ఆదిత్య, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య సోదరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణ నూతన అధ్యక్షుడి కర్పూరం గవరయ్య గుప్త, కంభం విజయరాజులను నాయకులు, కార్యకర్తలు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.

వైఎస్సార్ విగ్రహంపై కక్ష ఎందుకు?



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం



నేతలు అడ్డుకోవడంతో నిలిచిపోయిన సుందరీకరణ పనులు

- జయంతి వేడుకలకు సిద్ధం చేసేందుకు నేతల ప్రయత్నం
- అడ్డుకున్న ఏలూరు కూటమి ప్రజాప్రతినిధులు ?

ఏలూరు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను చూస్తే కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుంది. తాజాగా ఈ కక్షపూరిత చర్యలు ఏలూరు నియోజకవర్గానికి పాకాయి. దివంగత వైఎస్సార్ జయంతి వేడుకలు సమీపించిన నేపథ్యంలో ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహ ప్రాంతాన్ని సుందరీకరించేందుకు వైఎస్సార్ సీపీ నేతలు సిద్ధమయ్యారు. కానీ ఏలూరులోని కూటమి ప్రజాప్రతినిధులు పనులను అడ్డుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పేద, బలహీనవర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు ఆనాడు ముఖ్యమంత్రిగా జనరంజక పాలనతో ప్రజల హృదయాల్లో దేవుడుగా కొలుస్తున్నారు. ఆయన విగ్రహం ఉన్న ప్రాంతంలో మరమ్మతులను అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది.

ఇదీ పరిస్థితి

ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద చుట్టూ దిమ్మ పాడైపోవడంతో విగ్రహం వద్దకు వెళ్లే సమయంలో నేతలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నెల 8న దివంగత మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలు పురస్కరించుకుని విగ్రహ ప్రాంతాన్ని సుందరీకరణ పనులు చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఏలూరు నగర కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఆయన అనుమతి ఇవ్వడంతో విగ్రహం చుట్టూ ఉన్న దిమ్మ లోపలి భాగాన్ని బాగు చేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ లోపు టీడీపీ నేతల సూచనలతో పోలీసు అధికారులు పనులను అడ్డుకున్నట్లు చెబుతున్నారు. దీనిపై పోలీసు అధికారులను సంప్రదించగా వైఎస్సార్ విగ్రహం ఉన్న ప్రాంతం రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఉందని,వారి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఆర్అండ్‌బీ అధికారులను సంప్రదించగా విగ్రహ ప్రాంతం తమ పరిధి కాదనీ ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోనే ఉందని చెప్పడం గమనార్హం. ఇలా ప్రజా ప్రతినిధులు, పోలీస్ శాఖ అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు వంతుల వారీగా పనులు జరగకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఇదే విషయంపై వైఎస్సార్‌సీపీ నేతలు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి దృష్టికి తీసుకువెళ్లగా మాజీ ముఖ్యమంత్రి కావటంతో వైఎస్సార్ విగ్రహం వద్ద పనులు తామే చేయిస్తామని చెప్పారట. మొత్తానికి దివంగత వైఎస్సార్ విగ్రహం సుందరీకరణ పనులు జరగకుండా అడ్డుకుని తమ కక్షపూరిత చర్యలను కూటమి నేతలు బహిర్గతం చేసుకున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	44	బిళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	44	చామదుంపలు	36
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	44	కంద	--
కాకర కాయలు	40-48	బీట్‌రూట్	38
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	19
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	35
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



శ్రీ పాండురంగ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కల్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మహిళా భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో ఉదయం విఘ్నేశ్వర పూజ, కంకణధారణ, అఖండ స్థాపన పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు, శ్రీ లక్ష్మీ గణపతి హోమం, నారాయణ హోమం నిర్వహించారు. సాయంత్రం శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ స్వామి శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం దర్బారు సేవ, పవళింపు సేవ నిర్వహించి, నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి, తీర్థప్రసాద వినియోగం చేశారు. దేవస్థానం అర్చకుడు దండిభొట్ల కనకసుందర శర్మ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి సీహెచ్. చిన నాగేశ్వర రావు కార్యక్రమాలు పర్యవేక్షించారు. అలాగే స్థానిక కొత్తపేటలో ఉన్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి, జానకి రామాంజనేయ గౌరీ శంకర సాయి మందిరం ప్రాంగణంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల ప్రకాష ఆచార్యులు ఆలయానికి విచ్చేసిన భక్తుల వారి గోత్రనామాలతో అష్టోత్తర శతనామ పూజలను నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో తనిఖీ



ఆర్టీసీ డిపో వద్ద గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్‌కే షబ్నం

జంగారెడ్డిగూడెం: ఉచిత ప్రయాణం దృష్ట్యా బస్సుల నిర్వహణ సరిగా ఉండేలా చూడాలని ఆర్టీసీ కార్మికులకు జిల్లా డీపీటీవో ఎస్‌కే షబ్నం సూచించారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోను ఆదివారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం దృష్ట్యా పెరిగే రద్దీకి తగ్గట్లుగా బస్సులు మెయింటెనెన్స్ చేయాలని, బ్రేక్ డౌన్ లేకుండా జాగ్రత్తలు తీసుకుని ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్‌లు నడపాలన్నారు. జంగారెడ్డిగూడెం డిపో పరిధిలో గల కొయ్యలగూడెం, కామవరపుకోట, పోలవరం బస్‌స్టాండ్‌లను పరిశీలించి జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్‌కు సూచనలు చేశారు.

ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలి



ఆపస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం(ఆపస్) జిల్లా కార్యవర్గ సమావేశం పట్టణంలోని పార్కు రోడ్డులో గల సంఘ భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఇజి.సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఆప్షనల్ హాలిడే వల్ల సగం మంది ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు హాజరైతే విద్యార్థులకు పాఠాలు పూర్తిస్థాయిలో చెప్పడానికి అవకాశం ఉండదని, కావున ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా కాకుండా పాఠశాల మొత్తానికి సెలవు ఇవ్వాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ నందు డాక్యుమెంటేషన్, ఫొటోలు అప్‌లోడ్ చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులకు మాత్రమే ఉండాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలన్నారు. ఉపాధ్యాయులు ఉదయం 7 గంటల లోపే సెలవు అప్లై చేయమనడం సరికాదని, ఉదయం 9 గంటల వరకు సమయం ఉండాలన్నారు. విద్యాశక్తి కార్యక్రమాన్ని పాఠశాల ముగిసిన తర్వాత కాకుండా పాఠశాల పని వేళల్లోనే ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డి నాగేశ్వరరావు, ఆర్థిక కార్యదర్శి బీవీ సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి జి.గణపతి తదితరులు పాల్గొన్నారు.